
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
5
బుధవారం 22 మే 2024







అప్రమత్తంగా లేకుంటే.. మొదటికే మోసం

- రైతన్నలను వంచించేందుకు 'నకిలీ'ల ప్రయత్నం
- వానాకాలంపై అక్రమార్కుల ఫోకస్
- నాసిరకం విత్తనాలు.. ఎరువులు అంటగట్టే అవకాశం
- ప్రతి ఏటా నామమాత్రంగా సాగుతున్న తనిఖీలు
- భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా 260 ఫర్టిలైజర్ షాపులు
- గ్రామాల్లో అనుమతి లేని దుకాణాలు మరెన్నో

కృష్ణకాలనీ (భూపాలపల్లి), మే 21: వేసవి చివరి దశకు చేరుకుంది. వానాకాల ఆగమనం త్వరలోనే ఉంది. రైతన్నలు వ్యవసాయానికి సన్నద్ధమవుతున్నారు. యాసంగి ముగియగా ఖరీఫ్ పంటలు వేసుకొనేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అప్రమత్తత అవసరమంటున్నారు వ్యవసాయ శాఖ అధికారులు. అక్రమార్కులు, దళారుల బారిన పడకుండా జాగ్రత్తలు పాటిస్తేనే వ్యవసాయం లాభదాయకంగా ఉంటుందని సూచిస్తున్నారు. లేదంటే మోసాలకు గురికావాల్సి వస్తుందని అంటున్నారు.

వానాకాలం వ్యవసాయ (ఖరీఫ్) పనులు మొదలు కాకముందే దళారులు, అక్రమార్కులు అదును కోసం వేచి చూస్తున్నారు. నాసిరకం విత్తనాలు, నిషేధిత మందు లను రైతులకు అంటగట్టేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ప్రతి ఏటా అన్నదాతలు వంచనకు గురవుతూనే ఉన్నారు. ఈ అక్రమాలపై కొరడా ఝుళిపిస్తున్నామని వ్యవసాయ శాఖ, పోలీసు అధికారులు చెప్పుకుం టున్నా వారు సంయుక్తంగా నిర్వహించే తనిఖీలు నామమాత్రంగానే ఉంటున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రహస్య ప్రదేశాల్లో సరుకు నిల్వ

భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా 260 ఫర్టిలైజర్ షాపులు ఉన్నాయి. వీటిల్లో కొన్ని దుకాణాల యజమానులు ఇప్పటికే గుట్టు చప్పుడు కాకుండా రహస్య ప్రదేశాల్లో నకిలీ సరుకును నిల్వ చేసినట్లు తెలుస్తోంది. మరికొందరు దళారులు నకిలీ, నిషేధిత విత్తనాలను గ్రామాల్లో దిగుమతి చేసుకుంటున్నారని బహిరంగంగానే చర్చ సాగుతోంది. వీటిని రైతులకు అంటగట్టి సొమ్ము చేసుకొనేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

నిఘా పటిష్టం చేస్తేనే..

జిల్లా వ్యాప్తంగా ఈ ఖరీఫ్ ఆరంభంలో సంబంధిత అధికారులు నామమాత్రంగా తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నాసిరకం విత్తనాలు, నిషేధిత, నకిలీ మందులు విక్రయిస్తున్న వారిపై పకడ్బందీ చర్యలు ఉంటడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఖరీఫ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో నకిలీలపై ప్రత్యేక దృష్టి పెట్టి, కఠిన చర్యలు తీసుకొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోందని ఇటీవల మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం రైతన్నలకు ఊరట కలిగించింది. ఇప్పటికైనా నకిలీల బెడద తప్పుతుందని అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అయితే.. ఈ దందాను అరికట్టేందుకు సర్కారు ఎలాంటి చర్యలు తీసుకోబోతుందోననే ఉత్కంఠ నెలకొంది. మరోవైపు ప్రభుత్వం వెలువరించిన ప్రకటనతో అక్రమార్కుల్లో గుబులు మొదలైనట్లు తెలుస్తోంది.

గతంలో తెరపైకి నకిలీల పర్వం..

జిల్లాలో గతంలో నకిలీల పర్వం అధికారుల తనిఖీల్లో బయటపడిన ఘటనలు ఉన్నాయి. నాసిరకం విత్తనాలతోపాటు నిషేధిత గ్లైఫోసెట్ గడ్డి మందును అధికారులు పలు సందర్భాల్లో స్వాధీనం చేసుకున్నారు. రేగొండలో రూ. లక్ష 50వేల పైచిలుకు విలువ గల 3.5 కిలోల మిర్చి విత్తనాలను పట్టుకున్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల సుమారు రూ.12 లక్షల విలువ గల గ్లైఫోసెట్ గడ్డి మందును కూడా స్వాధీనం చేసుకున్నారు. అయితే.. బయటపడ్డ నకిలీల బాగోతం కొన్నయితే, అధికారుల కనుసన్నల్లోంచి తప్పుకున్న ఘటనలు చాలానే ఉంటాయనే విమర్శలు జిల్లాలో లేకపోలేదు. కొంత మంది అధికారుల కనుసన్నల్లో దళారులు, అక్రమ వ్యాపారులు రైతులను మోసగిస్తూ మోసగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి.

అప్రమత్తంగా లేకుంటే అంతే..

రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండటం చాలా అవసరమని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. గుర్తింపు పొందిన డీలర్ల వద్ద విత్తనాలను కొనుగోలు చేయాలని అంటున్నారు. బీజీ-3 పేరుతో చెలామణి అవుతున్న హెచ్‌టీ పత్తి విత్తనాలకు అనుమతి లేదని, వాటిని కొనుగోలు చేయొద్దని అంటున్నారు. విత్తనాలు కొనేటప్పుడు దుకాణదారుడి పేరు, చిరునామాతో పాటు సీడ్ లైసెన్స్ నంబర్లు జీఎస్టీ నంబర్ ఉన్న రశీదులు మాత్రమే తీసుకోవాలని సూచిస్తున్నారు. రశీదుపై విత్తన కంపెనీ పేరు, రకం, గడువు తేదీ, డీలర్ సంతకం తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని అంటున్నారు. పంటకాలం పూర్తయ్యే వరకు బిల్లు భద్రంగా దాచుకోవాలని, ఏదైనా నష్టం వాటిల్లితే పరిహారం కోసం ప్రయత్నం చేసుకునే వెసులుబాటు ఉంటుందని వివరిస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా లేకుంటే మోసాల బారిన పడాల్సి వస్తుందని సూచిస్తున్నారు.



బ్యారేజీకి ఎగువన కొనసాగుతున్న పనులు

వరదలను తట్టుకొనేలా..

'మేడిగడ్డ'లో తాత్కాలిక మరమ్మతు పనులు

- బ్లాక్-7కు దిగువన షీట్‌ఫైల్స్ ఏర్పాటు
- పిల్లర్ల కింద సాండ్ గ్రౌంటింగ్
- ఇప్పటికే 15వ నెంబర్ గేట్ ఎత్తివేత
- మిగిలిన గేట్ల ఎత్తివేతకూ చర్యలు
- ఈఆర్‌టీ, జీపీఆర్ పరీక్షల ఆధారంగానే ప్రక్రియ

మహదేవపూర్ రూరల్, మే 21 : కుంగుబాటుకు గురైన మేడిగడ్డ బ్యారేజీ బ్లాక్-7 పిల్లర్లు వానాకాలం వరదను తట్టుకునేలా ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. బ్యారేజీకి దిగువన షీట్‌ఫైల్స్ ఏర్పాటు చేయడంతో పాటు ఎగువన ఇప్పటికే ఉన్న షీట్‌ఫైల్స్‌ను తొలగించారు. ప్రాణహిత, గోదావరి నదుల నుంచి వచ్చే వరదను తట్టుకుని నిలబడేలా పిల్లర్ల సామర్థ్యాన్ని పెంచే దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు.

గేట్లను ఎత్తి.. నీరు దిగువకు వెళ్లేలా..

మేడిగడ్డ బ్యారేజీ మొత్తం 85 గేట్లుండగా బ్లాక్-7లో 11 గేట్లు ఉన్నాయి. గతేడాది అక్టోబరు 21న బ్యారేజీలోని బ్లాక్-7లో 20 నెంబరు పిల్లరు భారీ శబ్దాలు చేస్తూ కుంగుబాటుకు గురికాగ ఆపిల్లరుకు ఇరువైపులా ఉన్న పిల్లర్లు కూడా పాక్షికంగా కుంగాయి. అదే బ్లాకులో ఉన్న మిగతా పిల్లర్లకు కుంగుబాటు విస్తరించే అవకాశం ఉండటంతో అప్రమత్తమైన అధికారులు బ్యారేజీలో అప్పటికే నిల్వ ఉన్న 10.10టీఎంసీల నీటిని బ్లాక్-7 గేట్లు మినహా మిగతా బ్లాకుల్లో గేట్లన్నీ ఎత్తి దిగువకు విడుదల చేశారు. అప్పటి నుండి బ్లాక్-7గేట్లన్నీ మూసే ఉండగా మిగతా గేట్లన్ని ఆపరేషన్‌లోనే ఉన్నాయి. దీనిపై ఎన్‌డీఎస్‌ఏ, ఇతర నిపుణుల బృందాలు పరిశీలన చేసినప్పటికి పునరుద్ధరణకు ఎలాంటి సూచనలు చేయలేదు. కాగా వానాకాలం దగ్గరపడుతుండటంతో బ్లాక్-7లో గేట్లు వరదను తట్టుకునేలా ఏర్పాట్లు చేయాలని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) మధ్యంతర నివేదికలో పేర్కొనడంతో అధికారులు ఆదిశగా కసరత్తు ప్రారంభించారు. ఈనెల 17న బ్లాక్-7లో 15వ గేట్‌ను ఎత్తిన అధికారులు మిగతా గేట్లను ఎత్తేందుకు ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నారు. గేట్లు ఎత్తితే మిగతా గేట్లకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు రెండు బృందాలుగా అధికారులు పనులను చేపట్టినట్టు తెలిసింది. 16వ నెంబరు గేటుకు ఎగువన దిగువన టెక్నికల్‌గా అందిచాల్సిన సపోర్ట్‌ను సిద్ధం చేశాకే ఆగేటును, మిగతా గేట్లను ఎత్తనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈవానాకాలం వెళ్లేంత వరకు కేవలం వచ్చిన నీరు దిగువకు సాఫీగా వెళ్లేందుకు మాత్రమే ఏర్పాట్లు చేస్తున్నారు.

దిగువన షీట్‌ఫైల్స్.. పిల్లర్ల కింద సాండ్ గ్రౌంటింగ్

బ్లాక్-7లో గేట్లు, పిల్లర్లు వరదను తట్టుకునేందుకు బ్యారేజీకి దిగువన షీట్‌ఫైల్స్‌ను ఏర్పాట్లు చేస్తున్నారు. వరద తాకిడికి పిల్లర్లు, ర్యాఫ్ట్‌ల కింద నుంచి ఇసుక వెళ్లి బుంగ పడే అవకాశం ఉండటంతోనే బ్లాక్-7కు దిగువన షీట్‌ఫైల్స్ ఏర్పాటు తప్పని సరైనట్లు అధికారులు భావిస్తున్నారు. పిల్లర్లు, ర్యాఫ్ట్‌ల కింద ఉండే ఇసుకు జారుకుంటూ వచ్చి షీట్‌ఫైల్‌ను తాకి అక్కడే

మిగతా 7వ పేజీలో..

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

19న అదుపు తప్పి బోల్తా పడిన కారు

డ్రైవింగ్ చేసింది మైనర్ అని గుర్తించిన పోలీసులు



పాండ్ర విష్ణు (ఫైల్)

వాజేడు, మే 21: కారు అదుపు తప్పి బోల్తా పడిన ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 19న మండల పరిధి లోని జగన్నాథపురం వైజంక్షన్ సమీపంలో తెల్లవారుజామున కారు బోల్తా పడింది. ఆ సమయంలో కారులో మంగపేట మండల బ్రాహ్మణపల్లిలోని పెరికలకుంటకు చెందిన పాండ్ర విష్ణు(25), అదే గ్రామానికి చెందిన మైనర్‌తో పాటు మల్లూరుకు చెందిన రాకేష్ ఉన్నారు. ఏటూరునాగారంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి యజమాని కారులో జగన్నాథపురం మీదుగా వెంకటాపురం వైపు వీరు వెళ్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. జగన్నాథపురం వైజంక్షన్ సమీపంలో అతివేగంతో ఉన్న కారు అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో విష్ణుకు తీవ్ర గాయాలు కాగా అతనిని ఏటూరునాగారం తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసత్రిరలో చేర్పించారు. చికిత్స అందిస్తున్న క్రమంలో అతడు సోమవారం మృతి చెందాడు. ప్రమాద సమయంలో కారును డ్రైవ్ చేసింది మైనరే అని తేలింది. మృతుడు విష్ణు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు వాజేడు ఎస్సై చవళ్ల వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రమాదంకు కారణమైన మైనర్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ ప్రమాదంపై పోలీసులను సైతం తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినట్లు సమాచారం. మైనర్‌ను తప్పించే ప్రయత్నాలు జరిగాయని తెలిసింది.

అనాథగా మారిన బాలుడు

కారు ప్రమాదంలో మృతి చెందిన పాండ్ర విష్ణుకు నాలుగేళ్ల కొడుకు ఉన్నాడు. విష్ణు భార్య సౌజన్య 2020లో కరోనాతో మృతి చెందింది. ఎలక్ట్రీషియన్ పని చేసుకుంటూ కొడుకును, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను విష్ణు పోషించుకుంటున్నాడు. కుటుంబానికి పెద్ద దిక్కైన అతడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ ఇంట విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇప్పటికే తల్లిని కోల్పోగా తండ్రి కూడా కానరాని లోకాలకు వెళ్లడంతో విష్ణు కుమారుడు అనాథగా మారాడు.

పోలింగ్‌ను పకడ్బందీగా చేపట్టాలి

భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి కలెక్టరేట్, మే 21 : ఈనెల 27న నిర్వహించే వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. నోడల్, పోలీసు అధికారులు, పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు, రూట్, సెక్టార్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలకు పోలింగ్‌పై మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర మాట్లాడుతూ పట్టభద్రుల ఉప ఎన్నికల్లో 52 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని తెలిపారు. భూపాలపల్లి అసెంబ్లీ సెగ్మెంటులో 12,535మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని, ఇందుకు 16 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. 19మంది పీవోలు, 19మంది ఏపీవోలు, 38మంది ఓపీవోలు విధులు నిర్వర్తించనున్నారని వివరించారు. 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగుతుందని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి ఉద్యోగులు కలెక్టరేట్‌లోని జీ5లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో ఈనెల 23న ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, శిక్షణ నోడల్ అధికారులు అవినాష్, శామ్యూల్, ఆర్డీవో మంగిలాల్, డీఎస్పీ సంపత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై ఏఎస్‌వోల పరిశీలన



అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులతో ఏఎస్‌వోలు, అధికారులు

కాటారం, మే 21: కేంద్ర సచివాలయ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ల (ఏఎస్‌వోలు) పర్యటన మండలంలో రెండో రోజూ కొనసాగింది. గంగారం గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనులపై శిక్షణలో భాగంగా మంగళవారం పరిశీలించారు. నిషాన్‌సింగ్ నేతృత్వంలో ఏఎస్‌వోలు హిమాన్షు టైలర్, నీరజ్‌కుమార్, వివేక్‌కుమార్‌చౌదరి, అరుణ్‌కుమార్ అంగన్‌వాడీ కేంద్రాలు, పల్లె ప్రగతి పనులు, వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుతున్న సేవలు, పూర్వ పాఠశాల విద్య, ఆరోగ్యలక్ష్మి, పిల్లల ఎత్తు, బరువుల పురోగతి, మౌలిక సౌకర్యాలను పరిశీలించారు. పల్లెప్రగతిలో భాగంగా చేపట్టిన శ్మశానవాటిక, సెగ్రిగేషన్ షెడ్, గ్రామీణ క్రీడా ప్రాంగణం, పల్లె ప్రకృతి వనం, చెక్‌డ్యాంను సందర్శించి పనుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం (వెల్‌నెస్‌సెంటర్)ను సందర్శించి వైద్యసేవలు, మాతాశిశుసంరక్షణ, వాక్సినేషన్ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. వారివెంట సీడీపీవో రాధిక, సూపర్‌వైజర్ వీణ, ఏపీవో వెంకన్న, ఈసీ శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ సుమన్, పంచాయతీ కార్యదర్శి కరుణాకర్, ఏఎన్ఎం రజని తదితరులు ఉన్నారు.

టీఎస్ స్థానంలో ఇక టీజీ

- తక్షణమే అమలు చేయాలి
- ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు కలెక్టరేట్, మే 21: టీఎస్ స్థానంలో టీజీగా పేర్కొనాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయిన నేపథ్యంలో జిల్లాలోని అన్ని శాఖల అధికారులు తక్షణమే అమలు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్ర అబ్రీయేషన్స్ సూచించే టీఎస్ స్థానంలో టీజీని వినియోగించేందుకు కేంద్రం అనుమతి ఇస్తూ గెజిట్ జారీ చేసిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయని తెలిపారు. జిల్లాలో ఇకపై అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, ఏజెన్సీలు, పబ్లిక్ సెక్టార్ యూనిట్లు, ఏజెన్సీలు, స్వయం ప్రతిపత్తి గల సంస్థలు, వెబ్‌సైట్‌లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు, ఏదైనా ఇతర అధికారిక కమ్యూనికేషన్లు సైతం తెలంగాణ కోడ్‌ను టీఎస్‌కు బదులుగా టీజీని వాడాలని సూచించారు.

కేయూ ఇన్‌చార్జి వీసీగా వాకాటి కరుణ

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

గతంలో 'వరంగల్' కలెక్టర్‌గా పనిచేసిన అనుభవం

ఇప్పట్లో పూర్తిస్థాయి వీసీ నియామకం లేనట్లేనా..?



వరంగల్ ఎడ్యుకేషన్, మే 21: కాకతీయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్‌గా ఐఏఎస్ అధికారిణి వాకాటి కరుణను నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటిదాకా వీసీగా పనిచేసిన ప్రొఫెసర్ తాటికొండ రమేష్ పదవీ కాలం మంగళవారం ముగిసింది. దీంతో అదే రోజున ఇన్‌చార్జి వీసీగా కరుణను ప్రభుత్వం నియమించింది. కరుణ నియామకంపై అధ్యాపక, విద్యార్థి వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఐఏఎస్ అధికారిణి కావడం, మంచి అడ్మినిస్ట్రేటర్‌గా పేరుండడంతో కేయూలో జరిగిన అవినీతి, అక్రమాలు వెలికితీస్తారనే నమ్మకం ఉందని చెబుతున్నారు.

సుపరిచుతురాలే..

గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన వాకాటి కరుణకు మంచి పేరుంది. కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో మంచి అడ్మినిస్ట్రేటర్‌గా అందరి మన్ననలు అందుకుంది. ఆమె నియామకం పట్ల వర్సిటీ వర్గాల్లోనూ సానుకూల అభిప్రాయలే వ్యక్తం అవుతున్నాయి. ఐఏఎస్ అధికారిణి కావడంతో తాజా మాజీ వీసీ రమేష్‌పై జరుగనున్న విజిలెన్స్ విచారణ పారదర్శకంగా జరిగే అవకాశం ఉన్నట్లు వారు విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఆయనపై వచ్చిన అవినీతి, అక్రమాలను నిగ్గు తేల్చే అవకాశం ఉందనే అభిప్రాయాన్ని అధ్యాపక, విద్యార్థి వర్గాలు అభిప్రాయపడుతున్నారు.

పూర్తిస్థాయి వీసీ లేనట్లేనా...?

కేయూకు ఇప్పట్లో పూర్తిస్థాయి వీసీని నియమించే అవకాశాలు లేనట్లు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకు సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. కేయూకు మాత్రం ఏర్పాటు చేయలేదు. వీసీ పదవీ కాలం ముగింపునకు మూడు రోజుల ముందే విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశించడం, తీవ్రమైన ఆరోపణల మధ్య వీసీ పదవీ కాలం ముగియడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. కేయూలో గందరగోళ పరిస్థితులు ఉండటంతో వర్సిటీ పాలన గాడిలో పడేంత వరకు ఐఏఎస్ అధికారిని వీసీ ఇన్‌చార్జిగా కొనసాగించి ఆందోళనలు సద్దుమణిగాక పూర్తి స్థాయిలో వీసీని నియమించే అవకాశాన్ని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

రేపు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం

హాజరుకానున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), మే 21: జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎన్నికల సన్నాహక సమావేశం గురువారం జరుగనుంది. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు హాజరు కానున్నారు. ఆయనతో పాటు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి పాల్గొంటారు. పట్టభద్రులు ఈ సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కటకం జనార్దన్ కోరారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యం.. 100 మిలియన్ టన్నులు

- సింగరేణి పంచవర్ష ప్రణాళిక
- ప్రతి ఏటా 10శాతం ఉత్పత్తి వృద్ధి రేటు



సమావేశంలో మాట్లాడుతున్న సింగరేణి డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్

గోదావరిఖని, మే 21: బొగ్గు ఉత్పత్తి విషయంలో సింగరేణి భారీ దార్శనికతతో ముందుకెళ్తోంది 2030 వరకు సంస్థ వార్షిక ఉత్పత్తి 100 మిలియన్ టన్నులకు చేరుకునే విధంగా పంచవర్ష ప్రణాళికను ఏర్పాటు చేసుకుంది. ఇప్పటి నుంచి ప్రతి సంవత్సరం 10 శాతం వృద్ధి రేటును పెంచుకుంటూ 2030 నాటికి 100 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేసింది. సీఎండీ బలరాంనాయక్ దిశానిర్దేశనంలో సింగరేణి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు, జీఎంలు, మూడో శ్రేణి అధికారులు సమష్టిగా ఈ ప్రణాళికను ముందుకు తీసుకెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని ఇల్లందు క్లబ్‌లో రామగుండం, బెల్లంపల్లి, భూపాలపల్లి రీజియన్ల జనరల్ మేనేజర్లు, గని మేనేజర్లు, ఓసీపీల మేనేజర్లు, ఇతర విభాగాల ఉన్నతాధికారులతో సంస్థ డైరెక్టర్లు మంగళవారం సమావేశమయ్యారు.

సింగరేణి డైరెక్టర్ (పర్సనల్ అండ్ ఆపరేషన్) ఎన్‌వీకే శ్రీనివాస్, డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) సత్యనారాయణ పాల్గొని సంస్థ ముందస్తు ప్రణాళికను సింగరేణి మూడు రీజియన్ల అధికారులతో సమీక్షించారు. రానున్న ఐదేళ్లలో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, లాభాల్లో వృద్ధి, వివిధ రంగాల్లో విస్తరణ అంశాలపై వర్క్‌షాప్ నడిచింది. ఈ అన్నీ రంగాల్లో ప్రతి సంవత్సరం 10శాతం వృద్ధి రేటు సాధించేలా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. 2029-30 ఆర్థిక సంవత్సరం నాటికి 100మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకునే విధంగా ముందుకు పోవాలని డైరెక్టర్లు సూచించారు. అందులో 2024-25 ఆర్థిక సంవత్సరం నుంచే 10శాతం వృద్ధిని దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగాలని, సంస్థ లాభాల్లో కూడా ఈ వృద్ధి కనిపించే విధంగా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని వారు చెప్పారు. అందుకోసం క్షేత్ర స్థాయి నుంచి కూడా అన్ని అంశాలపై చర్యలు చేపట్టాలని సూచించారు. డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో భవిష్యత్‌లో పెరిగే విద్యుత్ అవసరాల దృష్ట్యా బొగ్గు అవసరాలు ఉంటాయని, అందుకు సింగరేణి సంస్థ ఈ ఐదేళ్లలో 100మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆ దిశగా వివిధ విభాగాలు రక్షణ సూత్రాలు పాటిస్తూ ఉత్పత్తి, ఉత్పాదకతలు పెంచుకోవడానికి సిద్ధం కావాల న్నారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తిలోనే కాకుండా థర్మల్, సౌర, జియో థర్మల్ ఉత్పత్తిలో కూడా అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉందన్నారు.

డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ 100మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించే విషయంపై సింగరేణిలోని ప్రతి ఉద్యోగికీ అవగాహన కల్పించాలన్నారు. పోటీ ప్రపంచంలో ప్రైవేట్ సెక్టార్‌తో సింగరేణి పోటీ పడే విధంగా ఎదగాలన్నారు. ఉత్పత్తి వ్యయం తగ్గించుకుంటూ వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేయాలన్నారు. ప్రధానంగా భూగర్భ గనుల్లో ఉత్పత్తి వ్యయాన్ని గణనీయంగా తగ్గించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. దేశ విద్యుత్ అవసరాల్లో సింగరేణి సంస్థ భాగస్వామిగా ఉండడం గర్వకారణమని డైరెక్టర్(ఈఅండ్‌ఎం) సత్యనారాయణ అన్నారు. సింగరేణి 100మిలియన్ టన్నుల భవిష్యత్ బొగ్గు ఉత్పత్తి ప్రణాళిక, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 10శాతం వృద్ధి సాధించే విషయాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ నిర్వహించారు. ఉత్పత్తి వ్యయం తగ్గించుకోవడం, ఉద్యోగుల హాజరుశాతం పెంచడం, నూతన బొగ్గు గనులను ప్రారంభించుకోవడం, బొగ్గు రవాణా, యంత్రాల పని సామర్థ్యాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోవడం, వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును అందించడం, రక్షణ సూత్రాలు పాటించడం అంశాలను వివరించారు.

ఈ సమీక్షలో ఆర్‌జీ-1, 2, 3 జీఎంలు చింతల శ్రీనివాస్, ఎల్‌వీ సూర్యనారాయణ, ఎన్ సుధాకర్‌రావు, కె. వెంకటేశ్వర్లు, భూపాలపల్లి జీఎం ఎస్‌డీ హబీబ్ హుస్సేన్, బెల్లంపల్లి రీజియన్ జీఎంలు డి.రవి ప్రసాద్, బి.సంజీవరెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎ.మనోహర్, ఎస్ఓ టు జీఎం రామ్మోహన్, కార్పొరేటర్ జీఎంలు, ఏజెంట్లు, ఏరియా ఇంజనీర్లు, నిట్ ప్రాజెక్టు మేనేజర్లు, ప్రాజెక్టు ఇంజనీర్లు, గ్రూప్ ఇంజనీర్లు, ఫైనాన్స్, ఐఈడీ మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఈత సరదా.. ముగ్గురి ప్రాణాలు తీసింది

- ఏనుమాముల ముసలమ్మకుంటలో ఇద్దరు యువకుల మృతి
- బయ్యారం దామెరచెరువులో మునిగి బాలుడి కన్నుమూత
- కుటుంబాల్లో విషాదం మిగిల్చిన ఘటనలు



జన్ను ఆదాం (ఫైల్)



జన్ను విజయ్ (ఫైల్)



జనుక గౌతమ్ (ఫైల్)

వివరాలు 6వ పేజీలో...

ఎంజీఎంలో నిలిచిన విదుత్ సరఫరా


అంధకారంలో ఎంజీఎం ఆస్పత్రి ఆవరణ

వరంగల్ మెడికల్, మే 21: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో మంగళవారం సుమారు ఆరు గంటలకుపైగా విద్యుత్ సరాఫరా నిలిచిపోయింది. సాయంత్రం 4.30 గంటలకు పోయిన కరెంటు.. రాత్రి 9.30 గంటల వరకు వచ్చింది. ఆస్పత్రిలోని జనరేటర్ల ద్వారా ఎమర్జెన్సీ వార్డులకు కరెంటు అందించారు. చాలావార్డుల్లో కరెంట్ లేకపోవడంతో రోగులు బయటకు వచ్చారు. వేసవి ఉక్కపోతకు ఇబ్బంది పడ్డారు. గతంలో కూడా ఇలాగే జరిగినా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టలేదు. వచ్చే వర్షాకాలంలో కూడా ఇదే పరిస్థితి కొనసాగితే సాధారణ రూములతోపాటు ఎమర్జెన్సీ రోగుల ప్రాణాలకు ఇబ్బంది కలిగే ప్రమాదం ఉందని రోగుల కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం స్పందించి ఇప్పటికైనా ఆస్పత్రిలో నిరంతర విద్యుత్ సరపరాకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


రిజిస్ట్రార్‌తో వాగ్వాదానికి దిగిన అకుట్ సభ్యులు

కేయూలో వీసీ రమేష్ దిష్టిబొమ్మకు శవయాత్ర

చర్యలు తీసుకోవాలని విద్యార్థుల డిమాండ్

వీసీ కీలక ఫైళ్లు మాయం చేస్తున్నారని అధ్యాపకుల ఆందోళన

వరంగల్ ఎడ్యుకేషన్, మే 21: వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయంలో వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు ఆందోళన చేశారు. మంగళవారం పరిపాలన భవనం ఎదుట వీసీ రమేష్ దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించారు. 'తాటికొండ అవినీతి అనకొండ' అనే ఫ్లెక్సీతో విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. వీసీ రమేష్ అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని విద్యార్థులు ఆరోపించారు. మంగళవారం వీసీ పదవీకాలం ముగియడంతో కొన్ని ముఖ్యమైన ఫైళ్లు మాయం చేశారని విద్యార్థులు అనుమానాలు వ్యక్తం చేశారు. వీసీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. వీసీ అక్రమాలపై విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు.

ఇదిలా ఉండగా, కేయూలో వీసీ రమేష్ లాడ్జీ నుంచి కీలక ఫైళ్లు యామమైనట్లు అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ యూనియన్(అకుట్) జనరల్ సెక్రెటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి ఆరోపించారు. ఈ మేరకు అయన అసోసియేషన్ సభ్యులతో కలిసి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఇస్తారి మాట్లాడుతూ.. వీసీ లాడ్జీ వద్ద ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని బయట పెట్టాలని డిమాండ్ చేశారు. మూడేళ్లుగా వీసీ రమేష్ తన పాలనను లాడ్జీ నుంచే కొనసాగించారని, విజిలెన్స్ విచారణంలో అవసరమ్యే ఫైళ్లను ఫ్యాబ్రికేట్ చేయడానికి బయటకు తరలించారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలున్నప్పటికీ కారులో వాటిని బయటకు తీసుకెళ్లడంపై తమకు అనుమానం ఉన్నదన్నారు. పీహెచ్‌డీ ప్రవేశాలు, మార్కుల లిస్టులు, కంప్యూటర్ కొనుగోళ్లకు సంబంధించిన అప్రూవల్ ఆర్డర్లను మార్చే అవకాశం ఉన్నట్లు వారు అనుమానాలు వ్యక్తం చేశారు. న్యాక్‌కు సంబంధించిన బిల్లులను సరిచేయడంతో పాటు ఇతరత్రా ఫైళ్లలో మార్పులు, చేర్పులు చేసేందుకు వీసీ ఫైళ్లను తరలించి ఉంటారని ఆరోపించారు.

కాగా, ఈ విషయమై రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా వీసీ రమేష్ తన వ్యక్తిగత పుస్తకాలు, జ్ఞాపికలు తదితర వస్తువులు తీసుకెళ్లి ఉంటారని సర్దిచెప్పడాన్ని వారు త్రీంగా ఖండించారు. ఒకానొక దశలో రిజిస్ట్రార్‌తో అకుట్ సభ్యులు తీవ్ర వాగ్వాదానికి దిగారు. వీసీ లాడ్జీ నుంచి ఫైళ్ల మాయం, సీసీ కెమెరాల ఫుటేజీ కోసం కేయూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

దాడి కేసులో ముగ్గురు కానిస్టేబుళ్లపై కేసు

వరంగల్ క్రైం, మే 21: ఈనెల 11న కె.రాజేష్ అనే వ్యాపారిపై జరిగిన దాడి కేసులో ముగ్గురు కానిస్టేబుళ్లతోపాటు ఒక ప్రభుత్వ ఉద్యోగిపై కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. ఈనెల 11న హనుమకొండ ట్రాఫిక్ కానిస్టేబుల్ ఎం.డి.తాజొద్దీన్ పుట్టిన రోజు విందుకు మరో ఇద్దరు కానిస్టేబుళ్లు కరుణాకర్ (బచ్చన్నపేట), రమేశ్ (రాయపర్తి)తో పాటు మహేందర్‌రెడ్డి (ప్రభుత్వ ఉద్యోగి), కె.రాజేష్ (వ్యాపారి) హాజరయ్యారు. విందులో తాజొద్దీన్‌తోపాటు మరో ముగ్గురు.. మహిళా ఉద్యోగుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారు. కానిస్టేబుళ్లతో పాటు ప్రభుత్వ ఉద్యోగి చేసిన వ్యాఖ్యలను వ్యతిరేకించిన రాజేష్.. వారితో వాగ్వాదానికి దిగాడు. దీంతో ఆగ్రహించిన నలుగురు.. రాజేష్‌ను కారులో తీసుకువచ్చి కేయూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని డబ్బాల జంక్షన్ వద్ద దాడి చేసి వదిలి వెళ్లారు. రాజేష్ పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టిన పోలీసులు.. తాజొద్దీన్, కరుణాకర్, రమేశ్‌తోపాటు మహేందర్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. కేసు నమోదు విషయాన్ని కేయూ పోలీసులు రహస్యంగా ఉంచారు.


బ్యారేజీకి దిగువన ఉన్న అప్రోచ్ రోడ్డు

వరదలను తట్టుకొనేలా..

(5వ పేజీ తరువాయి)

ఆగితే వరద ప్రభావం నివారించవచ్చనే షీట్‌ఫైల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. షీట్‌ఫైల్స్‌ను ఏర్పాటు చేసేందుకు వీలుగా బ్యారేజీకి దిగువన ఉన్న కాంక్రీటు స్లాబ్‌ను కట్‌చేస్తూ పనులను ముమ్మరం చేస్తున్నారు. దీంతో పాటు పిల్లర్లు కుంగుబాటుకు గురైన తర్వాత బ్లాక్-7లో చేపట్టిన ఈఆర్‌టీ(ఎలక్ట్రో రెసిస్టివిటీ టెస్ట్), జీపీఆర్(జియో ఫిజికల్ రాడార్) టెస్టుల ఆధారంగా గ్రౌంటింగ్ చేయనున్నట్లు తెలిసింది. ఫోమ్ గ్రౌంటింగ్‌తో పిల్లర్లు, ర్యాఫ్ట్‌ల క్రింద ఉన్న బుంగలను పూడ్చాలని తొలుత నిర్ణయించినా.. ఎన్‌డీఎస్‌ఏ సూచనలతో సాండ్ గ్రౌంటింగ్‌తోనే వాటి కింద ఉన్న బుంగలను పూడ్చాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. సాండ్ గ్రౌంటింగ్ ప్రక్రియలో ఈఆర్‌టీ, జీపీఆర్ పరీక్షల ఆధారంగా ర్యాఫ్ట్‌లకు హోల్స్ వేసి ఇసుక, స్యాండ్‌ను మిక్స్‌ను వేసి బుంగలను పూడిస్తే మళ్ళీ వచ్చే వరదలకు సీపేజీ సమస్యను నివారించడంతోపాటు తాత్కాలికంగా ర్యాఫ్ట్, పిల్లర్లకు అదనపు శక్తి చేకూరుతుందనేది సాండ్ గ్రౌంటింగ్ ఉద్దేశ్యమని అధికారులు చెబుతున్నారు.

బ్యారేజీలో అప్రోచ్ రోడ్ల తొలగింపు

బ్లాక్-7లో గేట్ల ఎత్తివేత, స్యాండ్ గ్రౌంటింగ్, బ్యారేజీకి దిగువన షీట్ ఫైల్స్ ఎర్పాటు పూర్తవ్వగానే గోదావరి నదిలో బ్యారేజీకి ఎగువన, దిగువన ఉన్న అప్రోచ్ రోడ్లను సైతం తొలగించనున్నారు. బ్యారేజీ నిర్మాణ సమయంలో ఉన్న కాఫర్‌డ్యామ్‌కు సంబంధించి ఉన్న షీట్‌ఫైల్స్, కాంక్రీటు వ్యర్థాల తొలగింపు ప్రక్రియ గతంలోనే ప్రారంభమవగా.. అది చివరి దశకు చేరుకుంది.

సివిల్స్ అభ్యర్థులకు ఉపకార వేతనాలు

దరఖాస్తులు ఆహ్వానిస్తున్న స్వచ్ఛందసంస్థ

జఫర్‌గఢ్, మే 21: సివిల్స్ శిక్షణ పొందే అభ్యర్థులకు ఉపకార వేతనాలు అందించేందుకు ఓ స్వచ్ఛంద సంస్థ ముందుకొచ్చింది. దీనికి సంబంధించి అభ్యర్థుల ఎంపిక పరీక్ష కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కొంగర ఎడ్యుకేషన్ హైదరాబాద్ సంస్థ ప్రతినిధులు కొంగర గంగాధర్‌రావు, జెట్టి రవికుమార్ తెలిపారు. మంగళవారం వారు జఫర్‌గఢ్‌లో మాట్లాడుతూ.. సివిల్స్ పరీక్ష రాయాలనే అభ్యర్థులు.. శిక్షణ పొందేందుకుగాను తమ సంస్థ యేటా ఉపకార వేతనాలు అందిస్తోందన్నారు. డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఇందుకు అర్హులని, ఈ పరీక్ష ద్వారా ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసి వారికి సివిల్స్ శిక్షణ కోసం ఉపకార వేతనాలు అందజేస్తామని అన్నారు. అభ్యర్థులకు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా జూన్ 23వ తేదీన వరంగల్‌లో ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి ఎలాంటి రుసుము లేదన్నారు. పూర్తి వివరాలకు 9346777568 మొబైల్ నంబరులో సంప్రదించాలని సంస్థ ప్రతినిధులు సూచించారు.

గ్రీన్ చాంపియన్ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, మే 21: రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి గ్రీన్ చాంపియన్ అవార్డుల కోసం ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, ప్రత్యేక అధికారులు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. మరిన్ని వివరాల కోసం జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస స్వామిని సంప్రదించాలని ఆయన సూచించారు.

ఈసెట్‌లో మెరిసిన ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు


ఎం. నవ్యశ్రీ

వరంగల్ ఎడ్యుకేషన్, మే 21: ఈసెట్‌లో వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు రాష్ట్ర ర్యాంకులు సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భైరి ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ఎన్.దీక్షిత్ 3వ ర్యాంకు, పి.వివేక్ 4వ ర్యాంకు, బి.హేమశ్రీ 9 ర్యాంకు, పి.నాగసాయి 19వ ర్యాంకు సాధించారన్నారు. ఈసీఈలో ఎం. నవ్యశ్రీ స్టేట్ ఫస్ట్ ర్యాంకు, వి.వైష్ణవ్ 2, వి.అర్షిత 5, కె.హర్షిత్ 6, పి.హారిక 7, ఎం.డి. సొహైల్ 11, ఈఈఈలో టి.శ్రీవాత్సవ్ 2, ఎం.కౌశిక్ కుమార్ 4, మెకానికల్‌లో కె.చందు 2, బి.నిఖిల్ 10, ఓ.గౌతమ్ 12వ ర్యాంకు సాధించారన్నారు.

ఈ- సేవల మూగనోము!

- వారం రోజులుగా పని చేయని కేంద్రాలు
- ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు
- లక్షల్లో నిలిచిపోయిన పన్ను చెల్లింపులు
- మరో ఐదు రోజుల పాటు ఇదే పరిస్థితి


హనుమకొండ అశోకా జంక్షన్ వద్ద మూసి ఉన్న ఈ-సేవా కేంద్రం

వరంగల్ కార్పొరేషన్, మే 21: గ్రేటర్ వరంగల్ పరిధిలో నివసిస్తున్న ప్రజలు పన్నుల చెల్లింపులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఇంటి పన్నులు, యూజర్ చార్జీలు సకాలంలో చెల్లించాలని నగర పాలక సంస్థ మైకులు పెట్టి మరీ ప్రచారం చేసింది. అయితే ప్రయోజనముంది.. పన్నులు వసూలు చేయాల్సి బల్దియా ఈ-సేవ కేంద్రాలు మూగ నోములు నోముతున్నాయి. వారం పాటు ఈ-సేవలు అందించక అక్కడి కంప్యూటర్ల స్క్రీన్లు మసకబారిపోయాయి. అక్కడ పని చేసే సిబ్బంది ప్రజలకు చెప్పలేక కార్యాలయాలకు తాళం వేసి బయటకు వెళుతున్నారు. సాంకేతికలోపంతోపాటు నెట్‌వర్క్ సవరణ చేస్తుండడంతో ఈ ఇబ్బంది ఏర్పడినట్లు వినియోగదారులకు సిబ్బంది చెబుతున్నారు. నగర పాలకసంస్థ పరిధిలో 12 ఈ- సేవా కేంద్రాలు పని చేస్తుండగా, ఒక్క సెంటర్‌లో కూడా సేవలు అందుబాటులో లేవు. దీంతో ఇంటి పన్ను, నల్లా పన్ను, ట్రేడ్ లైసెన్స్ వెకెట్ ల్యాండ్ చార్జీలతో పాటు మరి కొన్ని యూజర్ చార్జీలు చెల్లించేందుకు వచ్చిన వినియోగదారులకు నిరాశే మిగులుతోంది. గడువు తేదీ దాటిపోయి అదనపు భారం పడుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లక్షల్లో నిలిచిపోయిన పన్నులు

ఈ- సేవా కేంద్రాల్లో సాంకేతిక లోపం ఏర్పడడంతో బల్దియా ఖజానాకు గండిపడింది. ప్రతీ రోజు వివిధ రూపాల్లో లక్షల్లో వసూలయ్యే డబ్బు ప్రజల వద్దనే ఉండిపోతోంది. ఇప్పటికే బల్దియా మలేరియా సిబ్బంది, స్వచ్ఛ ఆటో డ్రైవర్లకు జీతాల కొరత ఉన్నప్పటికీ వారం రోజులుగా కంప్యూటర్ విభాగంలో ఏర్పడిన సాంకేతిక లోపాన్ని సరిదిద్దడంలో సంబంధిత అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కొందరు సిబ్బంది తమ తప్పు ఏమిలేదని, అంతా హైదరాబాద్‌లో వరంగల్ జీడబ్ల్యుఎంసీ సైట్ అప్‌డేట్ చేయడం వల్ల ఈ సమస్య ఎదురైందని చెప్పుకొస్తున్నారు. అంతే కాకుండా మరో ఐదు రోజుల పాటు ఇదే సమస్య ఉంటుందని కంప్యూటర్ నిపుణులు, సెంటర్ల ఉద్యోగులు పేర్కొంటున్నారు. పన్నుల చెల్లింపులు వేగవంతం కావాలంటే ఈ- సేవా కేంద్రాలు త్వరంగా పని చేసేందుకు సంబంధిత అధికారులు చొరవ చూపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


నక్కలగుట్టలో పని చేయని ఈ-సేవా కేంద్రం

బల్దియా పరిధిలో ఈ- సేవా కేంద్రాలు

వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో 12 ఈ- సేవా కేంద్రాలు పని చేస్తున్నాయి. హనుమకొండ పరిధిలో కాజీపేట సర్కిల్ ఆఫీస్-2, సుబేదారి వాటర్ ట్యాంక్, నక్కలగుట్ట బల్దియా కార్యాలయం, మచిలీబజార్ కమ్యూనిటీ హాల్, అశోకా జంక్షన్ సర్కిల్, నయీంనగర్‌లో ఈ- సేవ సెంటర్లు పని చేస్తున్నాయి. అదే విధంగా వరంగల్ పరిధిలో బల్దియా ప్రధాన కార్యాలయం, పోచమ్మమైదాన్, కాశిబుగ్గ సర్కిల్-1, హెడ్‌పోస్ట్ ఆఫీస్, శివనగర్, కరీమాబాద్‌లలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ- సేవలు ప్రజలకు సేవలందిస్తాయి. ఇందులో ఒక్కో సెంటర్‌లో ఇద్దరి నుంచి ముగ్గురు పనిచేస్తారు. ఈ కేంద్రాలను వరంగల్ మునిసిపల్ ప్రధాన కార్యాలయంతో పాటు కాశిబుగ్గ, కాజీపేట డిప్యూటీ కమిషనర్‌లు పర్యవేక్షిస్తారు.

రాష్ట్ర వ్యాప్తంగా సమస్య ఉంది..

అనిసుర్ రషీద్, బల్దియా అదనపు కమిషనర్

ఏప్రిల్ చివరి వరకు ఇంటి పన్నులో వడ్డీలో 5శాతం రాయితీ ఇచ్చాం. కొందరు చెక్కులు సమర్పించి రశీదులు పొందారు. కానీ కొన్ని చెక్కులు బ్యాంకులో చెల్లుబాటుకాక పోవడం, బల్దియాకు డబ్బులు చెల్లించినట్టు రశీదులు కలిగి ఉండడంతో ఈ సమస్య ఎదురైంది. ఈ సమస్యలు హైదరాబాద్ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ చూస్తుంది. ఒకటి, రెండు రోజుల్లో సమస్యలు పరిష్కారం జరిగి ప్రజలకు సేవలు అందిస్తారు.

భద్రకాళి సన్నిధిలో పుల్లెల గోపీచంద్


భద్రకాళి అమ్మవారిని దర్శించుకుంటున్న పుల్లెల గోపీచంద్ దంపతులు

వరంగల్ కల్చరల్, మే 21: ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పద్మశ్రీ పుల్లెల గోపీచంద్ దంపతులు మంగళవారం వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. వీరితోపాటు క్రికెట్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చాముండేశ్వర్‌నాథ్ కుటుంబ సభ్యులతో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు వీరి చేత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈత సరదా.. ముగ్గురి ప్రాణాలు తీసింది..

- ఏనుమాముల ముసలమ్మకుంటలో ఇద్దరు యువకుల మృతి
- బయ్యారం దామెరచెరువులో మునిగి బాలుడి కన్నుమూత

కుటుంబాల్లో విషాదం మిగిల్చిన ఘటనలు


జన్ను ఆదాం, జన్ను విజయ్ మృతదేహాలు

వరంగల్‌సిటీ/ బయ్యారం, మే 21: ఎండలవేళ ఈత సరదా ముగ్గురి ప్రాణాలను బలితీసుకుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మంగళవారం జరిగిన రెండు వేర్వేరు ఘటనల్లో ఓ బాలుడు సహా ఇద్దరు యువకులు మృతిచెందారు. ఈ ఘటనలను ఆయా కుటుంబల్లో తీవ్ర విషాదాన్ని నింపాయి. ఈ ఘటనలకు సంబంధించిన వివరాలివీ.. వరంగల్ నగరంలోని దేశాయిపేటకు చెందిన జన్ను విజయ్ అలియాస్ ఏసు(38), జన్ను ఆదాం(34) ఇద్దరూ పెయింటర్లుగా పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఇరుగుపొరున ఉండే ఈ ఇద్దరు రోజూ లాగే మంగళవారం ఉదయం పనికి వెళ్లి మధ్యాహ్నం సమయంలో ఇంటికి వచ్చారు. అప్పటికే ఉక్కపోత ఎక్కువగా ఉండడంతో జన్ను విజయ్, తన కుమారుడు జన్ను వివేక్, జన్ను ఆదాం తన కుమారుడు జన్ను ఆదిత్య, స్థానికంగా ఉండే మరోవ్యక్తి జన్ను రాహుల్ కలిసి ఈత కొట్టేందుకని గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ ఏనుమాముల పరిధిలోని ముసలమ్మకుంట వద్దకు చేరుకున్నారు. తమ పిల్లలను గట్టున ఉంచి.. విజయ్, ఆదాం నీటిలోకి దిగారు. వారు ఈత కొడుతూ ఆ కుంటలో ఉన్న బురదగుంతలో చిక్కుకుని ఎంతకీ పైకి రాలేదు. గట్టుపైనున్న వారి పిల్లలు గమనించి కేకలు వేయడంతో పక్కనే ఉన్న ఇందిరమ్మ కాలనీ, దేశాయిపేటకు చెందిన వారు అక్కడికి చేరుకుని గాలించి.. వారిని బయటికి తీయగా అప్పటికే విజయ్, ఆదాం మృతిచెందారు. అప్పటికే ఈ సమాచారం అందుకున్న ఏనుమాముల ఎస్‌ఐ శ్రీకాంత్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. జన్ను ఆదాం భార్య రాధిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఆదాంకు భార్య రాధిక, ఇద్దరు కుమారులు ఉండగా, విజయ్‌కి భార్య రమ, ఇద్దరు కుమారులున్నారు. ఇద్దరి మృతదేహాలను పోలీసులు ఎంజీఎం మార్చురీకి తరలించామని, ఎస్‌ఐ శ్రీకాంత్ కేసును దర్యాప్తు చేస్తున్నారని సీఐ పులి రమేష్ తెలిపారు.

ఈత నేర్చుకునేందుకు వెళ్లి బాలుడు..


గౌతమ్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలోని దామెరచెరువులో ఈత నేర్చుకునేందుకు వెళ్లిన ఓ ఎనిమిదో తరగతి విద్యార్థి మృత్యువాత పడ్డాడు. మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బయ్యారం ఎస్సీ కాలనీకి చెందిన జినుక లక్ష్మీనారాయణ, రేణుక దంపతుల కుమారుడు గౌతమ్ (14) మహబూబాబాద్‌లోని సంక్షేమ హాస్టల్‌లో ఉంటూ 8వ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో ఇంటికి వచ్చిన గౌతమ్ ఈత నేర్చుకునేందుకని తన చిన్నమ్మ కుమారుడు గోపాలదాసు గణేష్‌తో కలిసి తమ ఇంటి సమీపంలోని దామరచెరువుకు వెళ్లాడు. అయితే అతడు తాను దిగిన ప్రాంతంలో లోతుగా ఉందన్న విషయాన్ని గమనించని గౌతమ్ నీటిలో మునిగి మృతి చెందాడు. అతడికి తోడుగా వెళ్లిన గణేష్ పరుగున ఇంటి వచ్చి కుటుంబసభ్యులకు విషయం చెప్పడంతో వారు స్థానికుల సాయంతో చెరువులో వెతికి.. గౌతమ్‌ను బయటకు తీసి బయ్యారం పీహెచ్‌సీకి తరలించారు. కానీ గౌతమ్ అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. గౌతమ్ తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. జినుక లక్ష్మీనారాయణకు కుమారుడు గౌతమ్, కుమార్తె ఉండగా.. కుమారుడి మృతితో ఆ కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది.

ఎమ్మెల్సీ ఎన్నిక తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టులా ఉండాలి..

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


మాట్లాడుతున్న ఎర్రబెల్లి

రాంనగర్, మే 21: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టులా ఉండాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పట్టభద్రులకు పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న యూట్యూబ్ చానెల్ పెట్టి దందాలు చేసే చీటరని విమర్శించారు. ఆయనకు అవకాశం ఇస్తే ప్రమాదమన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రేవంతర్‌రెడ్డి మోసపూరిత మాటలు చెప్పి అధికారంలోకి వచ్చాడని ఆయన ఆరోపించారు. తీన్మార్ మల్లన్న, రేవంత్‌రెడ్డిలు ఇద్దరు ఇద్దరేనని, ఇద్దరు మోసగాళ్లేనని ఆయన ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఒక్కటికూడా నెరవేర్చలేదన్నారు. చిన్నచిన్న కారణాలు చూపి కాళేశ్వరానికి నీరు రాకుండా చేశారని, కరెంటు, సాగునీరు అందించలేదన్నారు. ఆరోగ్యశ్రీ అతిగతీ లేదని, కల్యాణలక్ష్మీ పథకాన్ని బుట్టదాఖలు చేశారని, నిరుద్యోగ భృతి అందించలేదన్నారు. ఎన్నికల ముందు ఓ మాట.. ఎన్నికల తర్వాత ఓ మాట రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నాడని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతుడైన బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని గెలిపిస్తే పట్టభద్రుల పక్షాన శాసనమండలిలో గళమెత్తుతాడని దయాకర్‌రావు తెలిపారు.

మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థి బ్లాక్ మెయిలరని, బీజేపీ అభ్యర్థి అసమర్థుడని ఆరోపించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి విద్యావంతుడు, ప్రజలకు సేవచేయాలనే తపన కలిగిన సమర్థుడని ఆయన తెలిపారు. పెద్దల సభ రైటర్స్‌కు వేదిక కావాలని, చీటర్స్‌కు వేదిక కాకూడదన్నారు. చీటరైన తీన్మార్ మల్లన్న లాంటి వ్యక్తికి అవకాశం కల్పిస్తే ప్రమాదమన్నారు. అధికార పార్టీని ప్రశ్నించే గొంతుకను ఎన్నుకోవాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలో రాకేష్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో హనుమకొండ జిల్లా పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, రసమయి బాలకిషన్, సతీష్ బాబు, నేతలు సంజయ్, రవిందర్‌సింగ్, జనార్ధన్‌గౌడ్, జోరిక రమేశ్, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

వెలవెలబోతున్న బీఆర్‌ఎస్ పార్టీ

మాజీ మంత్రి ఈటల రాజేందర్


సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

హనుమకొండ టౌన్, మే 21: ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన బీఆర్‌ఎస్ పార్టీ.. ఇప్పుడు ఆదరణ లేక వెలవెలపోతున్నదని మాజీ మంత్రి, బీజేపీ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ ఎద్దేవా చేశారు. వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం హనుమకొండ కిషన్‌పురలోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో జరిగిన సమావేశంలో ఈటల రాజేందర్ పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వంలో మంత్రుల మాటకే దిక్కులేదని, ప్రజలు వచ్చి సమస్యలు చెప్పుకున్నా పరిష్కరించే అధికారం లేదని విమర్శించారు. గత ప్రభుత్వం రూ.7,500కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పెండింగ్‌లో పెట్టారని విమర్శించారు. అధికారంలో ఉన్న పార్టీకి ఓటేస్తే బాధితుల తరపున ప్రశ్నించలేరని పేర్కొన్నారు. దేశ సమగ్రాభివృద్ధి కోసం పాటుపడుతున్న మోదీ నాయకత్వాన్ని బలపర్చాలని కోరారు. 2021 నుంచి ఇప్పటి వరకు ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలకు రావల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో వారు నరకయాతన అనుభస్తున్నారని ఈటల అన్నారు.

కుల, మత భేదం లేకుండా దేశ సమగ్రాభివృద్ధికి పాటుపడుతున్న మోదీ నాయకత్వాన్ని పట్టభద్రులు బలపర్చాలని కోరారు. స్వచ్ఛభారత్ పేరుతో దేశంలో మారుమూల గ్రామాల్లో మరుగుదొడ్లను నిర్మించి మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడిన వ్యక్తి మోదీ అని పేర్కొన్నారు. అమెరికా వంటి అగ్రరాజ్యంలో డిజిటల్ ట్రాన్సాక్షన్ అమలు కావడానికి పదేళ్లు పట్టిందని, కానీ మోదీ చొరవతో భారత్ మూడేళ్లలోనే అమలులోకి వచ్చిందన్నారు. రష్యా, ఉక్రెయిన్ దేశాలు సమస్యలను పరిష్కరించేందుకు మోదీని ఆశ్రయిస్తున్నాయన్నారు. అలాంటి కీర్తిని భారత్‌కు తీసుకొచ్చిన మోదీని ప్రజలు ఆదరించాలన్నారు. ఇందిరాగాంధీ నుంచి రాహుల్‌గాంధీ వరకు 'గరీబ్ హఠావో' అనే ఒకే నినాదంతో వస్తోంది తప్ప.. పేదరికాన్ని నిర్మూలించింది లేదని విమర్శించారు. ప్రేమేందర్‌రెడ్డి 40 ఏళ్ల అనుభవం, విద్యాభ్యాసం పట్టభద్రుల పక్షాన ప్రశ్నించేందుకు దోహదం చేస్తుందని ఈటల పేర్కొన్నారు. ఈ సమావేశంలో వరంగల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్, జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, వాగ్దేవి కళాశాలల అధినేత దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సివిల్ సప్లయీస్ టెండర్లలో అవకతవకలు

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి


మీడియాతో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

రాంనగర్, మే 21: పౌర సరఫరాలశాఖ పరిధిలో జరుగుతున్న టెండర్లలో భారీగా అవకతవకలు చోటుచేసుకున్నాయని, అర్హత లేని సంస్థలకు టెండర్లు కట్టబెడుతున్నారని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం హనుమకొండలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. పాఠశాలలకు మధ్యాహ్న భోజనం కోసం బియ్యం సరఫరా, ధాన్యం టెండర్లు అర్హత లేని కేంద్రియ బండార్ లాంటి సంస్థలకు కట్టబెట్టారని ఆయన ఆరోపించారు. ఈ విషయమై మూడురోజులుగా తాము ఆరోపణలు చేస్తున్నప్పటికీ మంత్రులు స్పందించడం లేదన్నారు. ఈ విషయంలో భారీగా డబ్బులు చేతులు మారాయని ఆయన విమర్శించారు. ఎవరికి ముట్టేవి వారికి ముట్టాయి కాబట్టే.. ప్రభుత్వ పెద్దలు స్పందించడం లేదని ఆయన దుయ్యపట్టారు. బీఆర్‌ఎస్ హయాంలో బ్లాక్‌లిస్ట్‌లో పెట్టిన కేంద్రియ బండార్ సంస్థకు టెండర్లు కట్టబెట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈ అవకతవకల విషయమై ఈనెల 23న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, సివిల్ సప్లయి కమిషనర్‌కు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో బీఆర్ఎస్ నేతలు రవీందర్‌సింగ్, జోరిక రమేశ్, వీరేందర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ వర్క్‌షాపులో బల్దియా కమిషనర్

లేక్ ప్రొటక్షన్‌పై అధికారులతో సమావేశం

వరంగల్ కార్పొరేషన్, మే 21: హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో మంగళవారం రాష్ట్ర మునిసిపల్ కమిషనర్లు, ఇంజనీరింగ్ విభాగం ఉన్నతాధికారులతో కలిసి సీడీఎంఏ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వరంగల్ నగర పాలక సంస్థ నుంచి కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో పాటు బల్దియా ఎస్ఈ ప్రవీన్‌చంద్ర పాల్గొన్నారు. 'లేక్ ప్రొటక్షన్ అండ్ రెజువినేషన్ ఇన్ అర్బన్ ఏరియాస్' అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సమావేశంలో వరంగల్ కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో నీటి వనరులు కావడడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించిందని, ఒక రోజు వర్క్‌షాపు ద్వారా చాలా విషయాలు తెలుసుకున్నామన్నారు. సీడీఎంఏ గైడ్‌లైన్స్ ప్రకారం పనులు నిర్వహిస్తే సహజ వనరులు రక్షించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మునిసిపల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిశోర్, సీడీఎంఏ దివ్య దేవరాజన్, వరంగల్ ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

మరో ముగ్గురికి గాయాలు


విజయ్ (ఫైల్)

కాజీపేట, మే 21: జిమ్ సెంటర్ బోర్డు సరిచేస్తుండగా విద్యుత్ తీగలు తాకి ఒకరు మృతి చెందగా మరో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట నిట్ సమీపంలో పెట్రోల్ పంపు ఎదురుగా ఉన్న బ్లూఫిట్‌నెట్ జిమ్ సెంటర్ ఐరన్ ఫ్లెక్సీ బోర్డు ఇటీవల గాలివానకు ఊడిపోయింది. బోర్డును సరిచేసేందుకు జిమ్‌సెంటర్‌లో పనిచేసే దర్గా కాజీపేటకు చెందిన విజయ్(28) ప్రయత్నించగా కుదరలేదు. దీంతో జిమ్‌లో శిక్షణ కోసం వచ్చిన రాము, విష్ణు, సందీప్, విజయ్ కలిసి బోర్డును తీసేందుకు ప్రయత్నించగా ప్రక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలు విజయ్‌కి తాకాయి. ఈ ఘటనతో విజయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలో శిక్షణకు వచ్చిన రాము, విష్ణు, సందీప్‌లకు తీవ్రగాయాలు కాగా, చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. కాగా, విజయ్ ఎంబీఏ పూర్తి చేసి జిమ్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. ఇతడు అవివాహితుడు.

'టెన్నిస్'పై క్రేజ్

నగరంలో విస్తరిస్తున్న క్రీడ

ఆసక్తి కనబరుస్తున్న యువత


లాన్ టెన్నిస్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్, మే 21: సంపన్నుల క్రీడగా పేరుగాంచిన లాన్ టెన్నిస్ క్రీడ నగరంలో రోజు రోజుకూ విస్తరిస్తోంది. ఒకప్పుడు హైదరాబాద్‌కు పరిమితమైన లాన్ టెన్నిస్ క్రీడపై నగరంలోని యువత ఆసక్తి కనబర్చుతున్నారు. క్రేజీ గేమ్‌గా పిలువబడే ఈ ఆటలో శిక్షణ పొందాలంటే సామాన్యులకు ఆర్థికంగా భారంగా ఉండేది. వేల రూపాయలతో రాకెట్‌లు కొనలేక సామాన్య యువకులు ఈ క్రీడపట్ల సుముఖత చూపించకపోయేవారు. ఇప్పుడు ఈ టెన్నిస్ క్రీడపై ప్రజల్లో ఆదరణ పెరుగుతోంది. అతి తక్కువమంది ఆడే లాన్ టెన్నిస్ క్రీడ.. ఇప్పుడు నగరంలో అత్యాధునిక హంగులు, అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో కూడిన కోర్టులు అందుబాటులోకి రావడంతో చాలామంది ఔత్సాహిక క్రీడాకారులు శిక్షణ తీసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాలలో పలు ప్రయివేటు పాఠశాలతో పాటు డీఎస్ఏ ఆధ్వర్యంలో హనుమకొండ జేఎన్ ఇండోర్ స్టేడియం సమీపంలో అత్యాధునిక హంగులతో కూడిన (సింథటిక్) టెన్నిస్ కోర్టు, అదే విధంగా సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్‌లోని టెన్నిస్ కోర్టుల్లో రోజూ వందల మంది క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు. డీఎస్ఏ ఆధ్వర్యంలో మే1 నుంచి ఏర్పాటు చేసిన లాన్ టెన్నిస్ వేసవి క్రీడా శిక్షణా శిబిరంలో నగరంలోని యువత పెద్దఎత్తున ఉత్సాహం కనబర్చుతున్నారు.

అధునాతన కోర్టులు

హనుమకొండ జేఎన్ఎస్‌లో రెండు సింథటిక్ కోర్టులు, సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో రెండు కోర్టులు, హనుమకొండ నిట్‌లో రెండు కోర్టులు, కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు కోర్టులు ఏర్పాటు చేయడంతో నిత్యం వందల మంది క్రీడాకారులతో టెన్నిస్ కోర్టులు కళకళలాడుతున్నాయి. అదే విధంగా నగరంలోని వివిధ ప్రయివేటు పాఠశాలలో సైతం లాన్ టెన్నిస్ క్రీడ విస్తరిస్తోంది. స్కిల్ స్ట్రోక్స్ ఇంటర్నేషనల్ స్కూల్, బిర్లా ఇంటర్నేషనల్ స్కూల్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, హైదరాబాద్ పబ్లిక్ పాఠశాలలో టెన్నిస్ కోర్టులు అందుబాటులో ఉండటం ద్వారా రోజు రోజుకూ ఈ క్రీడకు ఆదరణ పెరుగుతోంది.

చిన్నారులు, యువత ఆసక్తి చూపుతున్నారు

ఎ.నర్సయ్య, వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు

అత్యాధునిక టెన్నిస్ కోర్టులు జిల్లాతోపాటు నగరంలో అందుబాటులో ఉండటంతో చిన్నారులు, యువత ఈ క్రీడపై ఆసక్తి కనబర్చడంతో ఆదరణ పెరుగుతోంది. డీఎస్ఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టెన్నిస్ వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో పాల్గొనేందుకు యువత పెద్ద ఎత్తున తరలిరావడం అభినందనీయం. జిల్లా వ్యాప్తంగా టెన్నిస్ క్రీడ మరింత విస్తరించేందుకు జిల్లా టెన్నిస్ అసోసియేషన్ విశేషంగా కృషి చేస్తోంది.

టెన్నిస్ అంటే ఇష్టం

ధరణి, క్రీడాకారిణి

ఇతర క్రీడల కంటే టెన్నిస్ క్రీడ అంటే చాలా ఇష్టం. టెన్నిస్ క్రీడలో రాణించి జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకరావడమే నా లక్ష్యం. వేసవి సెలవుల్లో జేఎస్ఎస్ టెన్నిస్ కోర్టులో ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ పొందుతున్నా.. జిల్లా, రాష్ట్ర, జాతీయ టెన్నిస్ పోటీలలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాణించాలనే సంకల్పంతో సాధన చేస్తున్నా..

రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం

వర్ధంతి సభల్లో కాంగ్రెస్ నేతలు

ములుగు కలెక్టరేట్, మే 21: శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దివంగత మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. జిల్లాకేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ వర్ధంతిని పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల బిక్షపతి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు ఎమ్డీ.చాంద్‌పాషా, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపెల్లి రాజేందర్‌గౌడ్, తదితరులు రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆధునిక భావాలు, నిర్ణయాత్మక శక్తి కలిగిన వ్యక్తి రాజీవ్‌గాంధీ అని, కంప్యూటర్ విద్యను అమలు చేసి దేశంలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. దేశం కోసం గాంధీ కుటుంబం ప్రాణ త్యాగం చేసిందని అన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు బాదం ప్రవీణ్, నూనేటి శ్యామ్, మవూరపు తిరుపతిరెడ్డి, కంబాల రవి, రేవంత్, బోడ రఘు, సతీష్, అనిల్, ఓంప్రకాష్, బోయిని రాజు, బండి మధు, రాజయ్య, షకీల్, నాగరాజు, ఖుత్బుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

● కాటారం: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించారు. పలువురు జిల్లా, మండల స్థాయి నాయకులు రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజీవ్ వర్ధంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ నేతలు పండ్లు పంపిణీ చేశారు. దేశంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధికి రాజీవ్‌గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● తాడ్వాయి: మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఆధునిక భావాలు, నిర్ణయాత్మక శక్తి కలిగిన వారు రాజీవ్‌గాంధీ అని, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాని అని కొనియాడారు. భారతదేశంలో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులి సంపత్, జాలపు అనంతరెడ్డి, పాక సాంబయ్య, పీరీల వెంకన్న, తండాల శ్రీను, పాక రాజేందర్, దాయ వెంకన్న, బండారి చంద్రయ్య, గౌని మధు, ఆలేటి జయపాల్‌రెడ్డి, భూపతి జనార్ధన్, అనిల్, మొక్క శ్రీను, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



ములుగులో రాజీవ్ గాంధీ చిత్రపటం వద్ద నివాళలర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

పాఠశాలల అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

ములుగు అడిషనల్ కలెక్టర్ శ్రీజ

కన్నాయిగూడెం, మే 21 : అమ్మ ఆదర్శ కమిటీలు పాఠశాలల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ పి.శ్రీజ అన్నారు. మండ లంలోని కంతన పల్లి, ఏటూరు, సింగారం గ్రామాల్లో ఆమె మంగళవారం పర్యటిం చారు. అక్కడ జరుగుతున్న పాఠశాలల అభివృద్ధి పనులను పరిశీలించారు. తరగతి గదుల్లోని లైట్లు, ఫ్యాన్లు బిగించాలని, మరుగుదొడ్లకు రూఫ్, తలుపులు ఏర్పాటు తదితర పనులను చేపట్టాలని అన్నారు. విద్యా సంవత్సరంలో పాఠశాలకు వచ్చే విద్యార్థులకు అక్కడి వాతావరణం నూతనోత్తేజంగా కలిగించేలా ఉండాలని అన్నారు. ఆమె వెంట ఏపీడీ వెంకట నారాయణ ,ఎంఈఓ రాజేష్ , పీఆర్ ఏఈ బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న అడిషనల్ కలెక్టర్

గిరిజన చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలి

వెంకటాపురం(నూగూరు), మే 21: ఏజెన్సీలో గిరిజన చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ వీరభద్రప్రసాద్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. గిరిజన చట్టాలకు విరుద్ధంగా వలస గిరిజనేతరులు ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. గిరిజన చట్టాలను అమలు చేయడంలో అధికారులు విఫలమ వుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూనెం ప్రతాప్, మునేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గోండ్వాన నేతలు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు
రాజకీయ పార్టీలు సహకరించాలి

● ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు కలెక్టరేట్, మే 21: వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. కలెక్టరేట్ లోని తన చాంబర్‌లో ఆమె జిల్లాలోని వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశమయ్యారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ ఈనెల 27న ఉదయం 8నుంచి సాయంత్రం 4గంటల వరకు జరగనుందని, జూన్ 5న కౌంటింగ్ ప్రక్రియ ఉంటుందని అన్నారు. 52 మంది అభ్యర్థులు పోటీలు ఉన్నారని తెలిపారు. సాధారణ ఎన్నికల మాదిరిగా మాక్ పోలింగ్ ఉండదన్నారు. పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్స్ ఓపెన్ చేసి చూపిస్తారని, ఆ సమయంలో బాక్స్ మొత్తం ఖాళీగా ఉండాలని అన్నారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న దృష్ట్యా రాజకీయ పార్టీలు కులం, మతం, ప్రాంతంపై విద్వేషాలు పెంచే వ్యాఖ్యలు చేయడం నిషేధమన్నారు. ఓటర్లను ప్రలోభాలకు, బెదిరింపులకు గురిచేసినా, తప్పుడు ప్రచారాలు చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా పరిధిలో 17పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా 10,229 మంది ఉన్నారని తెలిపారు. 6,587 మంది పురుషులు, 3,712 మంది మహిళలు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారని అన్నారు. ఎన్నికల్లో విధులు కేటాయించిన సిబ్బందికి ఓటుహక్కు వినియోగానికి ఫారం-12 పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో ఈనెల 22న ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. 22న ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటుహక్కు వినియోగానికి సమయం కేటాయించామని తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో పోలింగ్ మెటీరియల్ పంపిణీ, రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, 26న సిబ్బందికి మెటీరియల్ అందజేయనున్నామని వెల్లడించారు. వృద్ధులు, దివ్యాంగుల సహాయార్థం పోలింగ్ కేంద్రాల్లో వీల్‌చైర్లు అందుబాటులో ఉంటాయని అన్నారు. ఈసమావేశంలో ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల డీటీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు

వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలికి ఈనెల 27న జరగనున్న ఉప ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌ను కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 24 వరకు ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించే ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హేమాచల క్షేత్రంలో ప్రత్యేక పూజలు

మంగపేట, మే 21: మండలంలోని మల్లూరు లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజు మంగళవారం ఉదయం అగ్నిప్రతిష్ఠాపన, ధ్వజరోహణం తదితర కార్యక్రమాలను భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ ప్రధానార్చకుడు అమరవాది మురళీకృష్ణామాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆలయం ఎదుట క్షేత్రపాలకుడైన శ్రీ పంచముఖాంజనేయస్వామి మూలవిరాట్‌కు 10 రకాల అభిషేకాలు, అర్చనలను అర్చకులు నిర్వహించారు. పట్టువస్త్రాలు, పూలమాలలతో స్వామి వారిని అలంకరించి భక్తులకు దైవ దర్శనాలను గావించారు. అలాగే సుదర్శన హోమాలను వేదపండితులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం దేవతా ఆహ్వానం, బేరిపూజ, బలిహరణ, నివేదన, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు జరిగాయి. భద్రాచలం దేవస్థానం ప్రధానార్చకుడు శ్రీమాన్ పోడి రామాచంద్రాచార్యులు ధ్వజరోహణం, బ్రహ్మోత్సవాల కార్యక్రమాలపై భక్తులకు వివరించారు. భద్రాచలం అర్చక, పురోహిత బృందం సభ్యులు కె.వీరాంచిచార్యులు, పి.అభిరామాచార్యులు, కె. భరద్వాజచార్యులు, ఎస్.వెంకటాచార్యులు, ఎ.మణిదీప్ ఆచార్యులు, ఎ.రామనర్సింహాచార్యులు, ఎస్.పి. మదన్‌మోహానాచార్యులు ప్రత్యేక పూజలు చేసి, శాంతి హోమాలను నిర్వహించారు.



ధ్వజస్తంభం వద్ద బేరిపూజ చేస్తున్న పురోహితులు

అనుమతి లేకుండానే
ఇంటి నిర్మాణాలు

పట్టించుకోని పంచాయతీ అధికారులు

మొగుళ్లపల్లి, మే 21: ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు మండల కేంద్రంలో ఇష్టారాజ్యంగా ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు. పంచాయతీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో ఈ తంతంగం యథేచ్ఛగా కొనసాగుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండల కేంద్రంలోని చిట్యాలకు వెళ్లే ప్రధాన రహదారిలో పోలీస్‌స్టేషన్ నుంచి బస్టాండ్ కూడలి వరకు ఉన్న రోడ్డు పక్కన భవన నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి భూపాలపల్లి జిల్లాకేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి నిత్యం 24గంటలు వివిధ వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డుకు అతి సమీపంలోనే ఇంటి నిర్మాణాలు చేపట్టడం వల్ల వచ్చిపోయే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు గ్రామ పంచాయతీ నుంచి ఆన్‌లైన్‌లో ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకుని అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఇక్కడ మాత్రం అలాంటి దాఖలాలు లేవని తెలుస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మండల కేంద్రంలో ఎలాంటి అనుమతి లేకుండా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణాలను నిలిపివేయాలని ప్రజలు కోరుతున్నారు.



అనుమతి లేకుండా చేపడుతున్న ఇంటి నిర్మాణం

ఆరోగ్య మహిళా కేంద్రంలో వైద్య పరీక్షలు

వెంకటాపురం(నూగూరు), మే 21: మండలంలోని ఎదిర ఆరోగ్య మహిళా కేంద్రంలో వైద్యాధికారి భవ్యశ్రీ మంగళవారం 74 మంది మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 12మంది నుంచి రక్తనమూనాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక లారీల పట్టివేత

కాటారం, మే 21: కాటారం, మల్హర్ మండలాల పరిధిలో అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న లారీలను సోమవారం రాత్రి పట్టుకున్నట్లు సీఐ నాగార్జునరావు తెలిపారు. వే బిల్లులు లేకుండా జీరో దందాలో ఇసుక లారీలు హైదరాబాద్ తరలుతున్నాయని వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి తనిఖీ చేసినట్టు చెప్పారు. గంగారం క్రాస్ రోడ్డు, మద్దులపల్లి చెక్ పోస్ట్, కొయ్యూరు బ్రిడ్జి సమీపంలో మూడు లారీలు పట్టుబడ్డాయని వెల్లడించారు. వాటిని సీజ్ చేసినట్టు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సైలు అభినవ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓవర్ లోడ్‌తో వెళ్తుండగా...

మండలంలోని గంగారం క్రాస్ రోడ్డు, మేడిపల్లి వద్ద సోమవారం రాత్రి తనిఖీ చేయగా ఇసుక ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న మూడు లారీలు పట్టుబడ్డాయని ఎంవీఐ సమ్మాని తెలిపారు. లారీలు ఓవర్‌లోడ్‌తో వెళ్తున్నాయనే సమాచారంతో తనిఖీలు చే పట్టినట్టు పేర్కొన్నారు. అనుమానం ఉన్న పలు లారీలను వేబ్రిడ్జిపై తూకం వేయిం చగా మూడు లారీల్లో ఓవర్‌లోడ్ ఉన్నట్లు గుర్తించి కేసు నమోదు చేశామ న్నారు. రెండు లారీల్లో 10టన్నుల చొప్పున, ఒక లారీలో 9టన్నులు అధికంగా ఉండటంతో జరిమానా విధించి మైన్స్, మినరల్స్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించామని తెలిపారు.

ఫర్టిలైజర్ షాపుల్లో అధికారుల తనిఖీలు



ఫర్టిలైజర్‌షాపులో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

వెంకటాపురం(నూగూరు), మే 21: మండల కేంద్రంలోని ఫర్టిలైజర్, పెస్టిసైడ్, విత్తన షాపులను స్థానిక సీఐ బం డారి కుమార్, ఎస్సై అశోక్, ఏటూరునాగారం అగ్రికల్చర్ ఏడీ శ్రీధర్, స్థానిక ఏవో నర్సిం హారావు మంగళవారం ఆకస్మి కంగా తనిఖీలు నిర్వహించారు. ఈసంద ర్భంగా వారు ఆయా షాపుల్లో ఉన్న విత్తనాలు, పురుగుమందులతోపాటు పలు రిజిష్టర్లను పరిశీలించారు. రైతులకు నకిలీ విత్త నాలు, పురుగుమందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని యజమానులను హెచ్చరించారు.

కల్తీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు

వాజేడు: మండలంలోని విత్తనాల విక్రయదారులు కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని పేరూరు ఎస్సై గొర్ల రమేష్ హెచ్చరించారు. మంగళవారం ఆయన పేరూరు స్టేషన్ పరిధిలోని ధర్మవరంలో ఆకస్మాత్తుగా విత్తన షాపులపై దాడులు నిర్వహించారు. విత్తనాలకు సంబంధించి క్రయ విక్రయాలు, రికార్డులను పరిశీలించారు. విత్తనాలను కొన్న రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. దాడుల్లో ఎలాంటి నాసిరకం విత్తనాలు లభించలేదని చెప్పారు. ఎస్సైతో పాటు ఏఈవో హరీష్ ఉన్నారు.

'కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలి'



తాడ్వాయిలో మేనిఫెస్టో కరపత్రాన్ని విడుదల చేస్తున్న కాంగ్రెస్ నేతలు

తాడ్వాయి, మే 21: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్‌ను గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ కోరారు. మండల కేంద్రంలో మంగ ళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లా డారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ నుంచి పోటీచేస్తున్న తీన్మార్ మల్లన్నను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఇందుకోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. అనంతరం మేనిఫెస్టో కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు పులి సంపత్, జాలపు అనంతరెడ్డి, పాక సాంబయ్య, పీరీల వెంకన్న, తండాల శ్రీను, పాక రాజేందర్, దాయ వెంకన్న, బండారి చంద్రయ్య, గౌని మధు, ఆలేటి జయపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్య ఓటు వేయాలి

వెంకటాపురం(నూగూరు): ఈనెల 27న జరిగే వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని వెంకటాపురం సొసైటీ అధ్యక్షుడు చిడెం మోహన్‌రావు కోరారు. మంగళవారం మండలకేంద్రంలో కార్యకర్తల సమావేశం జరగగా ఆయన మాట్లాడారు. మల్లన్న విజయం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. అనంతరం మేనిఫెస్టో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, నాయకులు బాలసాని వేణు, మన్నెం సునీల్, చిడెం శివ, గార్లపాటి రవి, రమేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికను సమర్థంగా నిర్వహించాలి

● అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సత్యపాల్‌రెడ్డి

ములుగు కలెక్టరేట్, మే 21: వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్‌ను సమర్థంగా నిర్వహించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి అన్నారు. మంగళ వారం కలెక్టరేట్‌లోని సమావేశపుహాల్‌లో ఆయన పాల్గొని ఉప ఎన్నికల నిర్వహణ, పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ విధానంపై పీవోలు, ఏపీవోలు, ఓపీవోలకు శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా సత్యపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో పీవోలు, ఏపీవోలు, ఓపీవోల పాత్ర కీలకంగా ఉంటుందని అన్నారు. ఎన్నికల సంఘం విధివిధానాలపై అంద రికీ అవగాహన ఉండాలని తెలిపారు. పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, ఓటర్లు బ్యాలె ట్ బాక్స్‌లలో బ్యాలెట్ పేపర్‌తో ఓటు వేయనున్న దృష్ట్యా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఎన్ని కల నియమ నిబంధనలను పాటించాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో శ్రీనివాస్ కుమార్, ములుగు తహసీల్దార్ విజయభాస్కర్, సూపరింటెండెంట్ శివకుమార్, ఎన్నికల డీటీలు విజయ్, అనీస్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి

'ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి'

చిట్యాల, మే 21: వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్ కోరారు. మండలంలోని పట్టభద్రులను ఆయన మంగళవారం కలిశారు. ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్య ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రేమేందర్‌రెడ్డి 40 సంవత్సరాలుగా విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుండ సురేష్, సాద సదానందం, యువ మోర్చా మండల అధ్యక్షుడు మైదం శ్రీకాంత్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు రాయిని శ్రీనివాస్, ప్రభాకర్, చింతల రాజేందర్, లటికే స్వామి తదితరులు పాల్గొన్నారు.



చిట్యాలలో ఎన్నికల ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

కౌంటింగ్ ఏర్పాట్లను వేగవంతం చేయాలి

పార్లమెంట్ ఎన్నికల అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి) : వచ్చేనెల 4న జరిగే పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల కళాశాలలో మంగళవారం కౌంటింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలోని అసెంబ్లీ సెగ్మెంట్‌ల వారీగా ఓట్ల లెక్కింపుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్, రిసివింగ్ సెంటర్లు, అసెంబ్లీ సెగ్మెంట్‌ల వారీగా ఓట్ల లెక్కింపు ఏర్పాట్లలో భాగంగా గదులు, వసతుల మ్యాప్‌లను పరిశీలించి, అధికారులకు తగు సూచనలు చేశారు. భద్రత పరమైన అంశాలను పరిశీలిస్తూ ఏర్పాట్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. స్ట్రాంగ్‌రూంలు, కౌంటింగ్ హాల్ వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు, తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, లైట్లు పనిచేస్తున్నాయా! లేదా? అని నిర్ధారణ చేసుకుని ప్రత్యామ్నాయంగా జనరేటర్ సదుపాయం అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. కౌంటింగ్ టేబుల్స్, కౌంటర్లు, కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు, విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి, అభ్యర్థులు, ఏజెంట్‌ల రాకపోకల కోసం మార్గాలను సూచిస్తూ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా పాత్రికేయుల కోసం ఏర్పాటు చేసే మీడియా సెంటర్‌ను పరిశీలించి, ఇతర సదుపాయాలకు సంబంధించి ఏర్పాట్లపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. స్ట్రాంగ్‌రూంల వద్ద సీసీ కెమెరాల నిఘాలో నిరంతరం పర్యవేక్షణ జరపాలన్నారు. స్ట్రాం గ్‌రూం ద్వారం సీల్, తాళాలలను పరిశీలించారు. 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్‌టొప్పో, ఎం.డేవిడ్, మానుకోట ఆర్డీవో అలివేలు, డీఎస్పీ తిరుపతిరావు, అధికారులు నర్మద, హరిప్రసాద్, దేవేందర్, కృష్ణప్రసాద్, జర్పుల సుధాకర్ పాల్గొన్నారు.



కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అద్వైత్‌కుమార్ సింగ్

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్రగాయాలు

కాటారం, మే 21: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మండ లంలోని ధన్వాడ గ్రామంలో మంగళ వారం సాయం త్రం చోటుచే సుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. బుర్రి వెంకటేశం అనే గీత కార్మికుడు ఎప్పటి లాగే కల్లు తీయడానికి తాటిచెట్టు ఎక్కాడు. మోకు జారిపోవడంతో ఒక్కసారిగా చెట్టు మీద నుంచి జారి కిందపడ్డాడు. దీంతో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. తోటి గీత కార్మికులు, కుటుంబ సభ్యులు హుటాహుటిన వరంగల్ ఆస్పత్రికి తరలించారు. మెదడులో రక్తం గడ్డకట్టడంతో పరిస్థితి విషమంగానే ఉన్నట్లు బంధువులు తెలిపారు.



అపస్మారక స్థితిలో వెంకటేశం